క్లుప్తంగా

పాఠశాల భవనాన్ని పూర్తి చేయాలి



అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలో అసంపూర్తిగా ఉన్న శ్రీపొట్టిశ్రీరాములు ఉన్నత పాఠశాల భవనాన్ని వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం బృందం పాఠశాలలను సందర్శించి మధ్యలో నిలిచిపోయిన భవనాన్ని పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు తరగతి గదుల కొరత ఉన్న నేపథ్యంలో భవనాన్ని వెంటనే పూర్తి చేయాలన్నారు. అలాగే మంచినీటి సౌకర్యం కల్పించాలని, మరుగుదొడ్లను అందుబాటులోకి తేవాలని కోరారు. నాయకులు ఎస్ఎండీ షరీఫ్, పార్వతయ్య, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

నేడు 'చౌడేశ్వరీ దేవి వైభవం' నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: తొగట వీర క్షత్రియ సేవా సంఘం, నందవరీక బ్రాహ్మణ సంఘం, దేవాంగ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో 'శ్రీ చౌడేశ్వరీ దేవి వైభవం' నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కంభంపాటి పామిలేటి దర్శకత్వం వహించిన నందవరం శ్రీ చౌడేశ్వరీ దేవి అమ్మవారి పూర్తి చరిత్ర పురాణానుబంధ చారిత్రక నాటకంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన కళాకారులు వివిధ పాత్రల్లో నటిస్తున్నారని పేర్కొన్నారు.

26న బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని బాస్కెట్‌బాల్ కోర్టులో ఈనెల 26న జిల్లా బాలబాలికల జూనియర్ జట్లకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధి దాదాబాష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2007 జనవరి 1 తరువాత పుట్టిన క్రీడాకారులు అర్హులని తెలిపారు. క్రీడాకారులు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువ పత్రం తప్పనిసరిగా తీసుకు రావాలని సూచించారు. ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు వచ్చే నెల 14 నుంచి 17వ తేదీ వరకు పిఠాపురంలో నిర్వహించే 10వ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్‌లో పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. వివరాలకు 97006 26167 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆక్రమణల తొలగింపు



పాతబస్తీలో ఆక్రమణలను తొలగిస్తున్న పట్టణ ప్రణాళిక సిబ్బంది

కర్నూలు (టౌన్): పాతబస్తీలోని గడియారం ఆసుపత్రి వద్ద రహదారిని ఆక్రమించి ఉన్న 15 షాపులను గురువారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు తొలగించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందకు ఆక్రమణలను తొలగిస్తున్నట్లు సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారి అంజాద్ బాషా, బిల్డింగ్ సూపర్‌వైజర్ మధుగోపాల్, ప్లానింగ్ కార్యదర్శులు ఉన్నారు.

యుద్ధ ప్రాతిపదికన పైపులైన్ మరమ్మతులు

కర్నూలు (టౌన్): సంతోష్ నగర్ వద్ద జాతీయ రహదారిపై ప్రధాన తాగునీటి పైపులైన్ మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ స్పష్టం చేశారు. ఆయన గురువారం మరమ్మతు పనులను పరిశీలించారు. ఇప్పటికే ఒక పైపుకు మరమ్మతులు పూర్తయ్యాయని, మరో పైప్ మరమ్మతులు వేగవంతంగా చేస్తున్నట్లు చెప్పారు.

చెత్త సేకరణ పకడ్బందీగా జరగాలి



చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి

కల్లూరు: గ్రామాల్లో చెత్త సేకరణ పకడ్బందీగా జరగాలని ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం బస్తిపాడు గ్రామంలో పర్యటించి చెత్త సేకరణను పరిశీలించారు. వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరిచేరవన్నారు. తడి, పొడి చెత్తను వేరువేరుగా పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు కె.లక్ష్మన్న, నాయకులు సురేష్, పంచాయతీ కార్యదర్శి బిందుభార్గవి పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): వైద్యులు సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం కర్నూలు మెడికల్ కాలేజీ సెమినార్ హాల్‌లో అన్ని విభాగాల హెచ్‌ఓడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ లక్ష్యాలను అధిగమించిన వైద్యులను అభినందించారు. ఈ–హాస్పిటల్ అమలుపై పూర్తిస్థాయిలో సమీక్షించారు. ఓపీ, ఐపీ, డిశ్చార్జ్, ఫార్మసీ డేటా ఎంట్రీ ప్రాసెస్‌ను ఈ–హాస్పిటల్‌లో అమలు చేసి, పర్యవేక్షణ చేయాలన్నారు. రోగులకు సంబంధించిన ఈ–హాస్పిటల్ ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్‌ను పటిష్టంగా అమలు చేయాలన్నారు. క్యాజువాలిటీకి వచ్చే రోగులకు సత్వర వైద్యం అందించి, వారిని సాధ్యమైనంత త్వరగా వార్డుల్లో అడ్మిట్ చేయాలన్నారు. ఇకపై ఓపీ, ఐపీ విభాగాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తానని, విధుల్లో లేని వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. సెక్యూరిటీ సేవలు మరింత పటిష్టం చేస్తామని, అన్ని విభాగాలు శుభ్రంగా ఉంచాలని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ.. వైద్యులు సమయపాలనలో ఉండి వారి ఎఫ్ఆర్ఎస్, ఇన్, అవుట్ అటెండెన్స్ తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, డాక్టర్ విజయానందబాబు, ఇన్‌చార్జ్ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, హెచ్‌ఓడీలు శ్రీనివాసులు, లక్ష్మీబాయి, మాధవీశ్యామల, డాక్టర్ శివబాల నాగాంజన్, కిరణ్‌కుమార్, ఏడీ మల్లేశ్వరమ్మ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఆంజనేయులు

కర్నూలు(అగ్రికల్చర్): సమాచార హక్కు చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి ఆంజనేయులు సూచించారు. కలెక్టరేట్‌లోని పట్టుపరిశ్రమ శాఖ జిల్లా అధికారి కార్యాలయంలో గురువారం రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు.. సమాచార హక్కు చట్టంపై ఆ శాఖ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2005లో సమాచార హక్కు చట్టం వచ్చిందని, అవినీతి, అక్రమాలను నిరోధించేందుకు ఇది ఎంతో తోడ్పడుతుందని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలు, ఉద్యోగాల భర్తీ తదితర అన్నింటిలో సమాచార హక్కు చట్టం కింద సాధారణ ప్రజలకు సమాచారం కోరే హక్కు ఉందని, దీన్ని తిరస్కరించే అధికారం లేదన్నారు. గ్రామ స్థాయిలో ఉచితంగా, మండల స్థాయిలో రూ.5, జిల్లా స్థాయిలో రూ.10 చెల్లించి ప్రజలు సమాచారం కోరవచ్చని సూచించారు. అడిగిన సమాచారాన్ని నిర్ణీత గడువులోపు ఇవ్వాలన్నారు. సమాచార హక్కు చట్టం రాష్ట్ర కార్యదర్శి జయన్న మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం వచ్చిన తర్వాత అన్ని ప్రభుత్వ శాఖల్లో అవినీతి కొంత మేర తగ్గిందని తెలిపారు. ఈ చట్టం వచ్చిన తర్వాత అధికారులు తప్పు చేయాలంటే భయపడుతున్నారని పేర్కొన్నారు. నిర్ణీత గడువులోపు అడిగిన సమాచారం ఇవ్వకపోతే సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



బి.తాండ్రపాడులో చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జి.రఘునాథ్

కర్నూలు(రూరల్): పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని కర్నూలు ఎంపీడీఓ జి.రఘునాథ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని బి.తాండ్రపాడు గ్రామంలో ఎంపీడీఓ గ్రామ పంచాయతీ అధికారితో కలిసి పర్యటించారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఉద్యోగులు నిత్యం పారిశుద్ధ్య కార్యక్రమాలు నిత్యం చేపట్టాలన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య చర్యలతో పాటు మురుగు నీటి నిల్వ ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ అధికారులను ఆదేశించారు. అలాగే దోమల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రజలు రాత్రివేళ దోమకాటు నుంచి రక్షణ పొందేందుకు దోమ తెరలను వినియోగించాలని సూచించారు. సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధన్వంతరీ, చండీహోమాలు

మహానంది: ఆషాఢమాసం, అమావాస్య సందర్భంగా గురువారం మహానందిలోని యాగశాలలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, వేదపండితులు నాగేశ్వరశర్మ ధన్వంతరీ, చండీహోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే స్థానిక అలంకార మండపంలో మహానందీశుడి దంపతుల కల్యాణం కనులపండువగా సాగింది. గంగ, కామేశ్వ రీదేవి మహానందీశ్వరస్వామి ఉత్సవమూర్తులను అలంకరించి కల్యాణ క్రతువులను నిర్వహించారు.

చిరు వ్యాపారులను వేధించడం తగదు



మునిసిపల్ అధికారులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ట్రేడ్ లైసెన్స్ పేరుతో మునిసిపల్ అధికారులు చిరు వ్యాపారులను వేధించడం తగదని, ఒక్కో వ్యాపారికి రూ.7–8 వేల వరకు జరిమానా విధించడం దారుణమని సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు ఎం.రాజశేఖర్, రోడ్డు సైడ్ వ్యాపారుల సంఘం నగర కార్యదర్శి ఎస్ఎండీ షరీఫ్ పేర్కొన్నారు. ఆదివారం సీఐటీయూ నాయకులు మునిసిపల్ అధికారులను కలిసి రోడ్డు సైడ్ వ్యాపారుల వ్యథలను వివరించారు. వడ్డీ వ్యాపారుల మాదిరిగా డబ్బులు వసూలు చేయడం తగదని, ట్రేడ్ లైసెన్స్ పేరుతో భారాలను ఎలా వేస్తారని ప్రశ్నించారు. అంతేగాక పన్ను కట్టకపోతే బండ్లు, త్రాసులను తీసుకెళ్లి వేధించడం ఏ మాత్రం భావ్యం కాదన్నారు. అధికారులు తమ వైఖరి మార్చుకోకపోతే పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు.

బంగారు కుటుంబాల అర్హతలను పున:పరిశీలించాలి



మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పబ్లిక్ ప్రైవేటు పీపుల్ పార్టనర్‌షిప్ (పీ – 4) పథకం కింద బంగారు కుటుంబాల అర్హతలను పున:పరిశీలించాలని నగరపాలక సంలస్థ కమిషన ర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. అలాగే మార్గదర్శకులను త్వరితగతిన గుర్తించాలని సూచించారు. గురువారం స్థానిక స్టేట్ బ్యాంకు ఎంప్లాయీ స్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో అడ్మిన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో పీ–4 పథకం కింద 10,600 కుటుంబాలను గుర్తించామని, అలాగే 629 మంది మార్గదర్శకుల ను ఇప్పటికే ఎంపిక చేశామన్నారు. 3,709 మంది బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు అనుసంధానం చేశామని, ఆగస్టు 15వ తేదీలోపు దత్తత తీసుకునేలా మార్గదర్శకాలను అన్వేషించాలన్నారు.ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అదే విధంగా ఆస్తి పన్ను, నీటి, కొ ళాయి, ట్రేడ్ లైసెన్సు వసూళ్లపై దృష్టి సారించాలని కమిషనర్ ఆదేశించారు. అదనపు కమిషనర్ ఆర్జీవీ క్రిష్ణ, సూపరింటెండెంట్ మజూరు బాషు, స్పెషల్ ఆఫీసర్ సుహేయిల్ తదితరులు పాల్గొన్నారు.



చినుకు పడితే చిత్తడే!

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కల్లూరు అర్బన్ పరిధిలోని మట్టి రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. దీంతో రోడ్లపై రాకపోకలు సాగించేందుకు పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బైక్‌లు అదుపు తప్పి కింద పడిన ఘనలు కూడా ఉన్నాయని స్థానికులు తెలిపారు. – కల్లూరు

ఈరన్నస్వామి చెంతకు పాదయాత్ర



పాదయాత్రగా బయలుదేరుతున్న భక్తులు

పెద్దకడబూరు: కౌతాళం మండలం ఉరుకుంద గ్రామంలో వెలసిన మహిమాన్వితుడైన ఈరన్న స్వామి చెంతకు పెద్దకడబూరు మండల కేంద్రం నుంచి దాదాపు 800మందికి పైగా గురువారం పాదయాత్ర చేపట్టారు. వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ డివిజన్ అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, ఉప సర్పంచ్, ఉరుకుంద ఈరన్నస్వామి ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు విజయేంద్రరెడ్డి, ప్రకాష్ శెట్టి ఆధ్వర్యంలో పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి సంవత్సరంలో 40నుంచి 50మందితో మొదలైన ఈ పాదయాత్ర ఈ సంవత్సరం 800మందికి పైగా భక్తులు పాల్గొనడం హర్షించదగ్గ విషయమన్నారు. పాదయాత్రగా బయలుదేరడం ఇది 5వ సంవత్సరం అన్నారు. భక్తులకు మధ్యలో అల్పాహారముతో పాటు మధ్యాహ్నం భోజన సదుపాయం కూడా కల్పించినట్లు తెలిపారు.

ఖాదర్‌లింగ స్వామి దర్గాలో భక్తుల సందడి



దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గాలో గురువారం అమావాస్య వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతేహలను నిర్వహించారు. గురువారం స్వామి వారం కావడంతో పాటు అమావాస్య కలిసిరావడంతో భక్తులు అధికంగా తరలివచ్చారు. కొంత మంది భక్తులు పిండి వంటలు వండి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధికంగా తరలిరావడంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. అంతకు ముందు తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. దర్గాలో భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేయడంతో భక్తులకు ఇబ్బందులు తప్పాయి.

రేపటి నుంచి క్రీడా పోటీలు

బేతంచెర్ల: పట్టణంలోని సరస్వతీ శిశు మందిరం ఉన్నత పాఠశాలలో ఈనెల 26, 27 తేదీల్లో కర్నూలు, నంద్యాల జిల్లాస్థాయి ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు పాఠశాల కమిటీ సభ్యులు మారుతి కృష్ణ,గౌరి హుసేన్‌రెడ్డి, గుండా గోపాల్, మధు మోహన్ రెడ్డి, మద్దిలేటి స్వామి తెలిపారు. సుమారు 400 మంది క్రీడాకారులు పోటీలకు హాజరవుతారని చెప్పారు. రోటరీ క్లబ్‌తోపాటు గౌరి హుసేన్‌రెడ్డి సహకారంతో విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తామన్నారు.

ఐవీఎఫ్‌తో సంతాన ఫలం



ఐవీఎఫ్‌పై అవగాహన పోస్టర్లు ప్రదర్శిస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): పిల్లలు లేని దంపతులకు ఐవీఎఫ్ విధానం వరం లాంటిదని సీనియర్ గైనకాలజిస్టులు, ఫెర్టిలిస్టులు డాక్టర్ బీటీ సీత, డాక్టర్ విష్ణుప్రియ చెప్పారు. ప్రపంచ ఐవీఎఫ్ డే సందర్భంగా గురువారం స్థానిక డాక్టర్స్ కాలనీలోని ఐఎంఏ భవన్‌లో ఏపీ ఇండియన్ సొసైటీ అసిస్టెడ్ రీ ప్రొడక్షన్ (ఇసార్) ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐవీఎఫ్, ఐయూఐ, డీఎఫ్ఐ, ఎగ్ ఫ్రీజింగ్‌ల గురించి నిపుణులైన ఫెర్టిలిస్టులు ప్రసంగించారు. అనంతరం డాక్టర్ బీటీ సీత, డాక్టర్ విష్ణుప్రియ మాట్లాడుతూ.. ప్రపంచంలో మొట్టమొదటి ఐవీఎఫ్ బేబీ జన్మించిన సందర్భంగా జులైన 25ను వరల్డ్ ఐవీఎఫ్ డేగా నిర్వహిస్తున్నారన్నారు. పిల్లలు కలగని దంపతులకు ఈ విధానం వల్ల పిల్లలు కలుగుతారన్నారు. నూతన విధానాలపై అపోహలు వీడి ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నగరంలోని పలువురు ఫెర్టిలిస్టులు, గైనకాలజిస్టులు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరీ జయంత్యుత్సవాలు



పూజలందుకుంటున్న చౌడేశ్వరీ దేవి



హారతి తీసుకుంటున్న మహిళలు

కర్నూలు కల్చరల్: సప్తగిరి మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయం ఆవరణలో వెలసిన చౌడేశ్వరీ దేవి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. అమ్మవారికి పంచామృతాభిషేకం, జ్యోతి ఉత్సవం, లలితా సహస్రనామ సహిత కుంకుమార్చన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమ సారె చీరెలు, గాజులు సమర్పించారు. భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు.

కల్లూరు: కల్లూరులో వెలసిన చౌడేశ్వరిదేవి జయంత్యుత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చౌడేశ్వరిదేవి దేవస్థానం, భజన బృందం ఆధ్వర్యంలో అమ్మవారికి అర్చకులు మహాభిషేకం, లక్షపుష్పార్చన, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.



కల్లూరులో వేడుకలకు హాజరైన భక్తులు

ప్రజా కవి గుర్రం జాషువా



గుర్రం జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాహితీ వేత్తలు, కళాకారులు

కర్నూలు కల్చరల్: పేద వర్గాలు, దళితులు, సామాన్యుల జీవితాలను పద్య రూపంలో వివరించి తెలుగు ప్రజల హృదయాలను చూరగొన్న కవి గుర్రం జాషువా అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. గురువారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో గుర్రం జాషువా 55వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కథా రచయిత ఇనాయతుల్లా, కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా మాట్లాడారు. సభ్యులు కేవీ రమణ, దస్తగిరి, సిద్దయ్య, శామ్యూల్, రాజారత్నం, క్రిష్టఫర్, చంద్రకంటి మద్దయ్య, గాండ్ల లక్ష్మన్న, బాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి



వీసీ వెంకట బసవరావుకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు అన్నారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. క్యాంప్‌ను ప్రారంభించిన వీసీ మాట్లాడుతూ.. ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవడానికి మెడికల్ క్యాంప్‌లు ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. ఆస్పత్రి యాజమాన్యం, వైద్యులు సేవా దృక్పథంతో వర్సిటీలో మెడికల్ క్యాంప్ నిర్వహణకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ విజయ్‌కుమార్ నాయుడు, ప్రిన్సిపాల్ ఆచార్య సీవీ కృష్ణారెడ్డి మాట్లాడారు. అనంతరం బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించారు. సీపీఆర్ చేసే విధానాన్ని డాక్టర్ పి.నాగరాజు, సునీల్‌కుమార్ యాదవ్ వివరించారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వెంకట రత్నం, డాక్టర్ నాగచంద్రుడు, శివప్రసాద్ రెడ్డి, డాక్టర్ మహేశ్వర్ రెడ్డి, బీవీ కొండారెడ్డి పాల్గొన్నారు.

కాలేజీ అభివృద్ధికి పూర్వ విద్యార్థుల చేయూత



కోల్స్ కాలేజీ ప్రిన్సిపాల్ నెహెమ్యాతో పూర్వ విద్యార్థులు

కర్నూలు సిటీ: తాము చదువుకున్న కాలేజీ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు నడుం బిగించారు. స్థానిక కోల్స్ మెమోరియల్ జూనియర్ కాలేజీ 1993–95 బ్యాచ్ సీఈసీ గ్రూప్ ఏ సెక్షన్‌కు చెందిన వారందరూ మూడు దశాబ్దాల తరువాత ఈ ఏడాది మే నెలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్నారు. ఆ సమావేశంలో కాలేజీ అభివృద్ధి కోసం ఇచ్చిన మాటకు అనుగుణంగా మౌలిక సదుపాయల కల్పనలో భాగంగా తరగతి గదులను ఆధునీకరించారు. పనులు పూర్తి కావడంతో గురువారం ఆ కాలేజీ ప్రిన్సిపాల్ నెహెమ్యాతో కలిసి వాటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు కాలేజీలోని తరగతి గదులను ఆధునీకరించి, కొత్త ఫ్యాన్లు, పెయింటింగ్స్, కుర్చీలు, లైట్లు ఏర్పాటు చేశారన్నారు. వారికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. పూర్వ విద్యార్థులు సురేష్, మద్దిలేటి, గోవిందు, సుబ్రమణ్యం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ఎస్పీ ప్రశంస



సీఐ జయన్నకు ప్రశంసాపత్రం అందిస్తున్న జిల్లా ఎస్పీ

పత్తికొండ రూరల్: పత్తికొండ సీఐ జయన్న, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ గురువారం కర్నూలులోని పోలీసు కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. ఇటీవల పోక్సో కేసులో నిందితుడికి 20 సంవత్సరాలు జైలు శిక్ష పడింది. నిందితుడిని పట్టుకుని కేసులో కీలక ఆధారాలు సేకరించడంలో కోర్టు కానిస్టేబుల్ హనీఫ్, పలు చోరీ కేసుల్లో రికవరీకి సంబంధించి కానిస్టేబుల్‌లు లక్ష్మీనారాయణ, చక్రితో పాటు హోంగార్డులు అన్వర్‌బాషా, బుగ్గప్పను ఎస్పీ అభినందించారని సీఐ తెలిపారు. పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య ఉన్నారు.

ట్రాఫిక్ ఏఎస్ఐకి ప్రశంస



ట్రాఫిక్ ఏఎస్ఐ లక్ష్మన్నకు ప్రశంసాపత్రం అందిస్తున్న జిల్లా ఎస్పీ

ఆదోని రూరల్: ఆదోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పని చేస్తూ ట్రాఫిక్‌ను నియంత్రించడంతో పాటు వాహనదారులకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించడంలో నైపుణ్యం ప్రదర్శించినందుకు గానూ ట్రాఫిక్ ఏఎస్ఐ లక్ష్మన్నకు జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ప్రత్యేకంగా అభినందించారు. గురువారం కర్నూలులో జరిగిన జిల్లా క్రైమ్ మీటింగ్‌లో ఎస్పీ చేతుల మీదుగా ట్రాఫిక్ ఏఎస్ఐ లక్ష్మన్నకు ప్రశంసా పత్రాన్ని అందిజేశారు. కార్యక్రమంలో ఆదోని డీఎస్పీ హేమలత ఉన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

దేవనకొండ: మండలంలోని బండపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం ఎక్సైజ్ సీఐ సువర్ణలత ఆధ్వర్యంలో ఎస్ఐలు సాయిప్రవీణ్, ప్రవీణ్ కుమార్ నాయక్.. సిబ్బందితో కలిసి దాడులు చేసి 5 బాక్సుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన శ్రీనివాస్, వెంకటేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. అక్రమ మద్యం అమ్మినా, తరలించినా కేసులు తప్పవని సీఐ హెచ్చరించారు.